
సాక్షి కామారెడ్డి

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



యథేచ్ఛగా నరికివేత

మాచారెడ్డి అటవీ ప్రాంతంలోని చెట్లను యథే చ్ఛగా నరికివేస్తుండడంతో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

- 8లో ▸



రోడ్లపైనే ఆరబోత

వరికోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేకపోవడంతో రోడ్లపైనే ఆరబోస్తున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
41.1 /20.4

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉం టుంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

50 పడకల ఆస్పత్రిగా దోమకొండ సీహెచ్‌సీ

- జీవో జారీ చేసిన ప్రభుత్వం



కామారెడ్డి టౌన్: ఎట్టకేలకు దోమకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడ్ అయ్యింది. ఈ ఆస్పత్రిని 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ మంగళవారం జీవో జారీ చేశారు. మొదట వంద పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం మాత్రం 50 పడకల ఆస్పత్రినే మంజూరు చేసింది. నూతన ఆస్పత్రి భవనం సివిల్ వర్కులు, పరికరాల కోసం ఆర్థిక శాఖ ఆమోదంతో రూ. 22 కోట్లను మంజూరు చేశారు.

'ఫిర్యాదుదారులు పూర్తి వివరాలు ఇవ్వాలి'

కామారెడ్డి క్రైం: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు తమ పూర్తి వివరాలు ఇవ్వాలని ఎస్పీ రాజేశ్ చంద్ర బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. దరఖాస్తులో తమ పూర్తి చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ తప్పనిసరిగా రాసి ఇవ్వాలని పేర్కొన్నారు. తద్వారా ఇచ్చిన ఫిర్యాదు ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నది, ఏ అధికారి విచారణ చేస్తున్నారు అనే విషయాలను మొబైల్ నంబర్ ద్వారా పిటిషన్‌దారులకు అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఫిర్యాదుల విషయంలో పారదర్శకత కోసం ఇది ఉపయోగపడుతుందని వివరించారు.

బయోమైనింగ్ యంత్రం ఏర్పాటు



కామారెడ్డి టౌన్: క్యాసంపల్లిలోని మున్సిపల్ డంపింగ్ యార్డ్‌లో బుధవారం బయోమైనింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు ఈ యంత్రాన్ని మున్సిపల్ నిధులతో కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. పట్టణంలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాక ఈ బయోమైనింగ్ యంత్రం ద్వారా తడి- పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తారు. పర్యావరణ కాలుష్యాన్ని కాపాడేందుకు ఈ బయోమైనింగ్ యంత్రం ఎంతగానో దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు

గాంధారి: గౌరారం కలాన్‌లో మంగళవారం కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైనవారు కోలుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం కల్తీ కల్లు తాగినవారిలో 17 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసింది. వారిని అదేరోజు రాత్రి బాన్సువాడ, నిజామాబాద్ ఆస్పత్రులకు తరలించారు. వారందరూ కోలుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. కల్తీ కల్లుకు బాధ్యులైన గ్రామానికి చెందిన శంకర్ గౌడ్, పాపాగౌడ్‌లపై కేసులు నమోదు చేశామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.



జొన్న రైతుకేదీ మద్దతు?

ప్రభుత్వం జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో దళారులు చెప్పిందే ధరగా సాగుతోంది. క్వింటాలుకు రూ. 2 వేలే ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. సర్కారు త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

– కామారెడ్డి క్రైం

జిల్లాలోని మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం, గాంధారి, పెద్దకొడప్‌గల్ తదితర మండలాల్లో జొన్న పంటను ఎక్కువగా సాగు చేశారు. ఆయా మండలాల్లో గతేడాది జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి మద్దతు ధరకు పంటను కొనుగోలు చేసింది. ఈసారి ఇప్ప

వ్యాపారులు చెప్పిందే ధర

టికీ జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీంతో ఇప్పటికే కోతలు పూర్తయిన చాలా మంది రైతులు డబ్బులు అవసరం ఉండి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర హైబ్రిడ్ రకానికి రూ. 3,371 ఉండగా వ్యాపారులు రూ.1,800 నుంచి రూ.2 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- అందినకాడికి దోచుకుంటున్న వ్యాపారులు
- కేంద్రాలు ప్రారంభించాలని రైతుల మొర

జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా యాసంగి సీజన్‌లో 70,600 ఎకరాల్లో జొన్న పంట సాగయ్యింది. ఈ పంటలో రెండు రకాలున్నాయి. ఒకటి నీటి తడి అందించకుండా పండించే సాధారణ రకం కాగా మరొకటి మూడు నుంచి నాలుగు తడులు అందించడం ద్వారా పండే నీళ్ల రకం జొన్న. ఒక్కో ఎకరానికి సాధారణ రకం 8 నుంచి 10 క్వింటాళ్లు, నీరందించే రకానికి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. గతంలో జిల్లా వ్యాప్తంగా 3 నుంచి 4 వేల ఎకరాల్లో మాత్రమే జొన్న సాగయ్యేది. పక్షులు, అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడం వల్ల ఈ పంట సాగుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. అయితే మూడేళ్లుగా జిల్లాలో జొన్న సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. గతేడాది యాసంగిలో 20,120 ఎకరాల్లో పంట సాగవ్వగా ఈసారి ఏకంగా సాగు విస్తీర్ణం 70,600 ఎకరాలకు పెరిగింది.

జిల్లాలో చాలా ఏళ్లుగా పత్తి సాగుచేస్తున్న రైతులు.. సరైన దిగుబడులు రాక నష్టపోతున్నారు. తెల్ల బంగారం పండించడానికి పెట్టుబడులూ ఎక్కువ అవసరం అవుతాయి. జొన్న సాగుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. దీంతో జిల్లాలోని పత్తి రైతులు ఈసారి జొన్న సాగు వైపు మళ్లారు. దీంతో ఈ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

ప్రతిపాదనల దశలోనే..

ఏటా జొన్న పంట ఎక్కువ సాగు చేసిన ప్రాంతాలను ఎంపిక చేసి జిల్లావ్యాప్తంగా దాదాపు 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఈసారి 15 కేంద్రాలకు అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించారు. కానీ ఇప్పటికీ మంజూరు రాకపోవడంతో కేంద్రాలు ప్రారంభం కాలేదు. ఈలోపు రైతుల వద్దనున్న పంటను దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. డబ్బులు అవసరం ఉండడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులకే పంటను విక్రయిస్తూ మద్దతు ధర దక్కక నష్టపోతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

రైతులు తొందరపడి వ్యాపారులను ఆశ్రయించొద్దు. జిల్లాలో త్వరలోనే జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. హైబ్రిడ్ రకం జొన్న పంటను తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి.

– మహేశ్, డీఎం, మార్క్‌ఫెడ్

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు త్వరగా జారీ చేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజాపాలన, మీ సేవ కేంద్రాల ద్వారా రేషన్ కార్డులకోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది, అధికారులు వెరిఫికేషన్ చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ధరణి, ఎల్‌ఆర్‌ఎస్, రాజీవ్ యువ వికాసం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశీలనలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే జిల్లా పౌర సరఫరాల అధికారిని సంప్రదించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలన్నారు. అర్హత కలిగిన వారికి మార్క్ అవుట్ ఇవ్వాలన్నారు. ఇళ్లు నిర్మించుకోలేని నిరుపేదలకు స్వయం సహాయక బృందాల నుంచి రుణాలు ఇప్పించాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల రిమార్కులను నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పునాది వరకు నిర్మించుకున్న వారి రిపోర్టులు, ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తే మొదటి విడత నిధులు విడుదల చేస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల సౌకర్యార్థం ప్రతి మండలంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. హెల్ప్‌డెస్క్ సిబ్బంది దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఆన్‌లైన్ చేసిన అనంతరం దరఖాస్తులను ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. 15 వ తేదీ నుంచి దరఖాస్తుల పరిశీలన ప్రారంభించాలని అధికారులకు సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, ఆర్డీవో వీణ, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



రాంపూర్ గ్రామంలో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా బుధవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. టెంకాయ కుస్తీ నుంచి వెండి కడియం వరకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. మహిళలు సైతం ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు.

– లింగంపేట



పొంచి ఉన్న ప్రమాదం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వెనుకవైపు ప్రహరీని ఆనుకుని చెట్లున్నాయి. అవి క్రమంగా విస్తరిస్తూ ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికే ప్రహరీని చీల్చుకుంటూ పెరిగాయి. దీంతో ప్రహరీ అక్కడక్కడ దెబ్బతిని, ఓవైపు ఒరిగిపోతోంది. భారీ వృక్షాలతో ఆస్పత్రిలోని భవనాలూ దెబ్బ తినే ప్రమాదం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



ప్రహరీని చీల్చుకుంటూ పెరిగిన చెట్లు

కాంగ్రెస్ పాలనలో దిగజారిన ఆర్థిక స్థితి

- హామీల అమలును విస్మరించారు
- ప్రభుత్వంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పక్కన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయం వృద్ధిరేటులో దేశంలోనే మొదటి స్థానంలో ఉంటే, రేవంత్‌రెడ్డి పాలనలో 11వ స్థానానికి దిగజారిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. జీఎస్‌డీపీ వృద్ధి రేటులో మూడో స్థానంనుంచి 14వ స్థానానికి పడిపోయిందన్నారు. బుధవారం సదాశివనగర్ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఒక్కడిగా బయలుదేరి కోట్లాది మంది ప్రజలను కదిలించి రాష్ట్రాన్ని సాధించడంతో పాటు పదేళ్ల పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారన్నారు. 24 గంటల కరెంటు, ఇంటింటికీ నల్లా నీళ్లు అందించారన్నారు. ఊరూరా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు దళారుల బెడద తప్పించామన్నారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఐదు వందల రోజులైనా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పట్టడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

జిల్లా నేతలతో సమీక్ష


వరంగల్ సభను విజయవంతం చేయడానికి ప్రశాంత్‌రెడ్డి జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. కామారెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధేలతోనూ సమావేశమై చర్చించారు.

వరంగల్ సభకు భారీగా తరలిరావాలి

గులాబీ పార్టీ ఆవిర్భవించి 24 ఏళ్లు పూర్తై 25వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్‌లో సభ నిర్వహించనున్నట్లు ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆ సభకు కామారెడ్డి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. సమావేశంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్‌ఎస్ నేతలు రాజేశ్వర్‌రావ్, నర్సింలు, మహేందర్‌రెడ్డి, కపిల్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, మోయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండతో జాగ్రత్త

- అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బతో ప్రాణానికి ముప్పు
- 'సాక్షి'తో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్





చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో

కామారెడ్డి టౌన్: ఎండలు ముదురుతున్నాయి. జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. భానుడి ప్రతాపంతో జనం ఇబ్బందిపడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న తరుణంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందంటున్నారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చంద్రశేఖర్. బుధవారం 'సాక్షి' ఆయనను ఇంటర్వ్యూ చేసింది. జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అందించిన సూచనలు..

- ఎండలు పెరుగుతున్నందున ఉదయం 10 గంటలలోపే పనులు పూర్తి చేసుకోవాలి. సాయంత్రం 5 గంటల వరకు ఇంట్లోనే ఉండేందుకు ప్రయత్నించాలి. ముఖ్యంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరిగితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం పెరుగుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో తిరగాల్సి వస్తే గొడుగు లేదా కనీసం టోపీ ధరించాలి.
- రోడ్లపై కనిపించే చల్లటి రంగు పానీయాలు, మద్యం తాగరాదు. మాంసాహారం తీసుకోవడాన్ని తగ్గించడం మేలు. మితంగా భోజనం చేయాలి.
- ఎండలో బరువు పనులు చేయొద్దు. నలుపు, పాలిస్టర్, మందంగా ఉండే దుస్తులు ధరించవద్దు.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగా లాంటివి తీసుకోవాలి. కనీసం రోజుకు ఆరు లీటర్లకుపైగా నీరు తాగాలి.
- జీలకర్ర దోరగా వేయించి పొడిగా చేసి అరస్పూన్ పొడిని గ్లాస్ నిమ్మరసంలో కలిపి ఉప్పు, చక్కెర వేసుకుని తాగితే శక్తి వస్తుంది.

వడదెబ్బ లక్షణాలు

తీవ్రమైన వడగాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశాలుంటాయి. వడదెబ్బకు గురైన వ్యక్తి నాడి వేగంగా కొట్టుకుంటుంది. నాలుక ఎండిపోయినట్లుగా ఉంటుంది. తీవ్రమైన తలనొప్పితో అపస్మారక స్థితికి చేరుకుంటారు. పైలక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

వడదెబ్బకు గురైతే..

వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. ఉప్పు కలిపిన ద్రవాలు, కొబ్బరినీరు, గ్లూకోజ్, మజ్జిగ, ఓఆర్ఎస్‌లలో ఏదైనా తాగించాలి. ఫ్యాన్ గాలి బాగా తగిలేలా చూడాలి. దుస్తులను వదులుగా చేసి తడి వస్త్రంతో ఒళ్లంతా తుడవాలి. మనిషికి తగినంత గాలి ఆడేలా చూడాలి. కీరదోస ముక్కలు ఎక్కువగా తినిపించాలి. వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

'కల్తీ కల్లు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'



బాధితులను పరామర్శిస్తున్న బీబీ పాటిల్, యెండల లక్ష్మీనారాయణ

బాన్సువాడ : కల్తీ కల్లు విక్రయిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్ చేశారు. బుధవారం బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ కల్లు బాధితులను ఆయన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్కి, అంకోల్, దామరంచ గ్రామాలకు చెందిన పలువురు కల్తీ కల్లు సేవించి అస్వస్థతకు గురయ్యారని, వైద్యులు ఎప్పటికప్పుడు చికిత్సలు అందించడంతో ప్రస్తుతం బాధితులు కోలుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతోనే కల్లులో ప్రమాదకరమైన ఆల్ప్రాజోలంను అధిక మోతాదులో కలిపి విక్రయిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు కల్తీ కల్లు బాధ్యులపై ఏ విధమైన చర్యలు చేపట్టారో తెలపాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రాజు, నాయకులు చీదరి సాయిలు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

బాన్సువాడ: నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి, అంకోల్ గ్రామాల్లో కల్తీ కల్లు కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు బాన్సువాడ రూరల్ సీఐ రాజేశ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్లులో ఆల్ప్రాజోలం అనే మత్తు పదార్థం కలపడం వల్ల 69 మంది ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఈ కల్లు విక్రయించిన కేసులో దుర్కి గ్రామానికి చెందిన లక్ష్మాగౌడ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించామన్నారు. నిందితుడిని జుడీషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు. ఆయన వెంట ఎస్సై లావణ్య, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, హరిచంద్ పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న సీఐ రాజేశ్

క్లుప్తంగా

అంకోల్ క్యాంపు సందర్శన


సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న బృందం

నస్రుల్లాబాద్: మండలంలోని అంకోల్ క్యాంపుతోపాటు బీర్కూర్ మండలంలోని రైతు నగర్ గ్రామాలను బుధవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అధికారుల బృందం సందర్శించింది. జాతీయ ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక కావడానికి గ్రామంలో చేపట్టిన కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. అంకోల్ క్యాంప్ గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను పరిశీలించి, పనితీరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, సెర్ప్ డీపీఎంలు సుధాకర్, సురేష్, స్త్రీనిధి ఆర్‌ఎం కిరణ్, మేనేజర్ మహేందర్, ఏపీఎం గంగాధర్,సీసీ సుజాత,నాగరాజ కుమారి, హన్మండ్లు, మాజీ సర్పంచ్ రాము పాల్గొన్నారు.

డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విశాల్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని హరిజనవాడలో మంగళవారం డ్రగ్స్ వాడకం, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఏఎస్‌ఆర్ ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ మాటాడారు. డ్రగ్స్, సిగరెట్, మద్యం తాగడంతో కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఆర్ ఫౌండేషన్స్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, మాల సంఘం అధ్యక్షులు ఉల్లెంగ కిరణ్, రాములు,అల్లం చిన్న బందయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి బుధవారం నలుగురిని అరెస్ట్ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. పేకాడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి వారి నుంచి రూ. 16,510లు, మూడు సెల్‌ఫోన్లు, మూడు బైకులను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా టేకు చెట్ల నరికివేత

- చోద్యం చూస్తున్న అధికారులు

మాచారెడ్డి : మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్(ఎం), సోమారంపేట, ఎల్లంపేట, రత్నగిరిపల్లి తదితర గ్రామాల పరిధిలో అడవి దట్టంగా ఉండేది. కలప స్మగ్లర్ల వేటుకు అడవంతా ఎడారిగా మారింది. అడవిని విచ్చలవిడిగా నరకడం వలన వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకమైంది. అడవిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్న ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా మండలంలోని ఘన్‌పూర్ అటవీ ప్రాంతంలో దుండగులు టేకు చెట్లను నరికి తరలించుకుపోయిన ఆనవాళ్లున్నాయి.

ఫిర్యాదు చేసినా అధికారులు మిన్నకున్నారు

కామారెడ్డి–సిరిసిల్లా రహదారికి అనుకున్న ఉన్న ఘన్‌పూర్(ఎం) అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కనే యథేచ్ఛగా టేకు చెట్లను నరికి తరలించుకుపోతున్నా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు మిన్నకున్నారని విమర్శలున్నాయి. గత కొన్నేళ్లుగా టేకు చెట్లను నరికి తరలిస్తున్న స్మగ్లర్లను పట్టించుకోకుండా, తరతరాలుగా హక్కు పత్రాలు కలిగి పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులపై కేసులు పెడుతూ వేధిస్తున్నారని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దహనసంస్కారాలకు అవసరమైన కలపను తీసుకువెళ్లడానికి అనుమతి ఇవ్వడం లేదని ఘన్‌పూర్ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వనసంరక్షణ సమితులను ఏర్పాటు చేసి అటవీ సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.



ఘన్‌పూర్(ఎం) అటవీ ప్రాంతంలో నరికివేతకు గురైన టేకు చెట్లు

పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం

అటవీ ప్రాంతంలో ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. టేకు కలప నరికితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. దహన సంస్కారాల కోసం తీసుకెళ్లిన కలపను తమ సిబ్బంది స్వాధీనం చేసుకోలేదు.

– దివ్య, ఎఫ్‌ఆర్వో, మాచారెడ్డి

మత్తు పదార్థాలపై నిఘాలో నిర్లక్ష్యమేల?

- దుర్కి కల్లు డిపోలో కలిపిన మత్తు మందే గౌరారం గ్రామానికి..


బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌరారం గ్రామ కల్తీ కల్లు బాధితులు

బాన్సువాడ : నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో కల్తీ కల్లు 90 మంది ప్రాణాలపైకి తెచ్చింది.గ్రామానికి చెందిన సురేందర్‌గౌడ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా కల్లు డిపో కొనసాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన సురేందర్‌గౌడ్ అనే వ్యక్తికి హైదరాబాద్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో మత్తు పదార్థాలు విక్రయించే వారితో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి సారి మత్తు పదార్థాలు ఒకే చోట నుంచి తీసుకొచ్చేవాడని తెలిసింది. ఈ మధ్య తక్కువ ధరకు మత్తు పదార్థాలు లభిస్తున్నాయని ఆశపడి మత్తు పదార్థాలను కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు తెలిసింది. సురేందర్‌గౌడ్ తన కల్లు డిపోలో ఇటీవల తక్కువ ధరకు కొనుగోలు చేసిన మత్తు పదార్థాలను కల్లులో కలిపి టీఎఫ్‌టీ లైసెన్సులు కలిగిన కల్లు దుకాణాలకు కల్లు సరఫరా చేశాడు. మత్తు మందు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో పాటు మోతాదుకు మించి మత్తు మందును కల్లులో కలిపారు. దీంతో ఆ డిపో పరిధిలో ఏఏ దుకాణాలకు కల్లు సరఫరా చేశారో ఆయా గ్రామాల్లో కల్తీ కల్లు సేవించిన వారందరూ ఆస్పత్రి పాలయ్యారు. సురేందర్‌గౌడ్ గాంధారి మండలం గౌరారం గ్రామానికి చెందిన సమీప బంధువైన మరొక వ్యక్తికి ఇదే మందు ఇచ్చాడు. సదరు వ్యక్తి కల్లులో దుర్కి కల్లు డిపోలో కలిపిన తక్కువ ధరకు తెచ్చిన మత్తు మందు కలిపాడు. చుట్టూ పక్కల ప్రజలు గౌరారంలో జాతరకు వచ్చి ఈకల్లు సేవించి అస్వస్థతకు గురయ్యారు. కల్తీ కల్లు సేవించిన బాధితులు బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సురేందర్‌గౌడ్ అనే వ్యక్తి మత్తు మందు ఎక్కడ కొనుగోలు చేశాడనే కోణంలో అబ్కారీ శాఖ విచారణ చేపట్టింది. స్థానిక అబ్కారీశాఖ అధికారులు ఏంతెలియదన్నట్లు వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బస్సులు రావడం లేదని రోడ్డెక్కారు

- ధర్నాకు దిగిన మద్దికుంట గ్రామస్తులు
- ట్రిప్పులు తగ్గించారని ఆగ్రహం

రామారెడ్డి : మండలంలోని మద్దికుంట గ్రామానికి ఆర్టీసీ బస్సులు రావడం లేదని బుధవారం మద్దికుంట మర్రి వద్ద విద్యార్థులు, గ్రామస్తులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో గ్రామానికి ఆర్టీసీ బస్సులు ఏడు ట్రిప్పులు వచ్చేవని, ప్రస్తుతం ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు రెండు ట్రిప్పులు మాత్రమే వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వచ్చిన విధంగా గ్రామానికి ఏడు ట్రిప్పులు నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాతో కామారెడ్డి వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. రామారెడ్డి పోలీసులు గ్రామస్తులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు. ఈవిషయమై ఆర్టీసీ డీఎం కరుణశ్రీని 'సాక్షి' వివరణ కోరగా బస్సులను తిరిగి పునరుద్ధరిస్తామని గ్రామస్తులకు తెలియజేశామని తెలిపారు.


రాస్తారోకో చేస్తున్న మద్దికుంట గ్రామస్తులు

బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

డిచ్‌పల్లి: బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకుడు జెట్లింగ్ ఎల్లోసా సూచించారు. సుద్దపల్లి గ్రామంలో తెయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1, యూనిట్-4ల సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవికాల ప్రత్యేక శిబిరంలో బుధవారం ఆన్‌లైన్ బెట్టింగ్‌తో నష్టాలపై ఆయన అవగాహన కల్పించారు. తెలంగాణ గేమింగ్ నిరోధక చట్టం 1974పై వివరించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి హెడ్‌కానిస్టేబుల్ ఏవీ రమణ సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు స్వప్న, స్రవంతి, పంచాయతీ కార్యదర్శి కవిత, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మురికికూపంగా బస్టాండ్

- పట్టించుకోని ఆర్టీసీ, బిచ్కుంద జీపీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతిరోజు వేల మంది ప్రయాణిస్తారు. అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. బస్టాండ్ ఆవరణలో మురికి నీరు చేరి భరించలేని దుర్గంధం వ్యాపిస్తోంది. మురికిలో పందులు పడుకుంటున్నాయి. బస్టాండ్ పర్యవేక్షణ చూస్తున్న ఆర్టీసీ అధికారులు మురికిని చూస్తున్నప్పటికీ తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మురికితో దుర్వాసన వస్తుందని, ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ, ఆర్టీసీ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, చుట్టుపక్కల దుకాణాల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్‌లోని స్టాల్స్ ద్వారా ఆర్టీసీకి ఆదాయం వస్తున్న కనీస సౌకర్యాల కల్పించడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

బీబీపేట/లింగంపేట/తాడ్వాయి : వాహనదారులు రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలతో పాటు వాహనాల ధ్రువపత్రాలు ఉంచుకోవాలని బీబీపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు. లింగంపేట మండలకేంద్రం సమీపంలోని నల్లమడుగు చౌరస్తాలో ఎస్సై వెంకట్రావు వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులకు జరిమానా విధించినట్లు తెలిపారు.తాడ్వాయిలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని పలువురికి జరిమానా విధించినట్లు తెలిపారు. మద్నూర్ మండలం మేనూర్ మోడల్ స్కూల్‌లో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు కామారెడ్డి పోలీసు కళాబృందం సభ్యులు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


బీబీపేటలో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్సై

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని చిన్నదేవిసింగ్ తండాలో డ్రెయినేజీలు లేక మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. దోమలు వృద్ధి చెంది వ్యాధులు సోకుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


చిన్న దేవిసింగ్ తండాలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

బాలుడి అదృశ్యం.. అరగంటలో గుర్తించిన పోలీసులు


బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి బస్టాండ్‌లో నాలుగేళ్ల బాలుడు తప్పిపోగా పోలీసులు అరగంటలో గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం పోతారం గ్రామానికి చెందిన వల్లపు నర్సవ్వ తన నాలుగేళ్ల మనువడు ఈశ్వర్‌ను వెంట తీసుకొని బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చి తిరుగు ప్రయాణంలో కొత్త బస్టాండ్‌కు చేరుకుంది. జ్యూస్ కొనుక్కుని వస్తానని బస్టాండ్‌లో మనువడిని కూర్చోబెట్టి పక్కనే ఉన్న స్టాల్‌కు వెళ్లింది. 5 నిమిషాల తర్వాత వచ్చి చూడగా బాలుడు కనిపించలేదు. ఆందోళనకు గురైన నర్సవ్వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే ప్రాంతంలో విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ శిరీష, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి బాలుడి ఆచూకీ కోసం గాలించారు. అరగంట తర్వాత అశోక్‌నగర్ చౌరస్తా వద్ద బాలుడిని గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి బాలుడిని తండ్రి అలకుంట ఎల్లయ్య, అమ్మమ్మ నర్సవ్వకు అప్పగించారు. పోలీసు సిబ్బందిని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.

గోశాల నుంచి ఆవుల చోరీ


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గోశాల సభ్యులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ గోశాలలోని రెండు ఆవులను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి అపహరించారని గోశాల కమిటీ ప్రతినిధులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి పాల్పడిన వారిని పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ అధ్యక్షుడు సంజయ్ ఎస్సై విజయ్ కొండకు వినతిపత్రం అందజేశారు.

క్రైం కార్నర్

కారు బోల్తా.. యువతి మృతి

పలువురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో కారు బోల్తా పడి చిన్నగుట్ట తండాకు చెందిన పీజీ విద్యార్థిని బాదావత్ అంజలి పూజ(22) మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమారం తండాకు చెందిన కేతావత్ మౌనిక, కేతావత్ శిల్ప, కేతావత్ రష్మిక, కేతావత్ శివకృష్ణతోపాటు చిన్నగుట్ట తండాకు చెందిన అంజలి పూజ షాపింగ్ కోసం మంగళవారం ఉదయం కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. రాత్రి 11 గంటలకు హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో గాంధారి సమీపానికి చేరుకున్నారు. గాంధారి–కామారెడ్డి రహదారిపై మాధవ్‌పల్లి–గాంధారి మధ్యలో ఏదో అడవి జంతువు అడ్డం రావడంతో కారు నడుపుతున్న శివకృష్ణ జంతువును తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న అందరికీ గాయాలయ్యాయి. అంజలి పూజకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్సులో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఉదయం 8.30 గంటలకు మృతి చెందినట్లు తెలిపారు. మిగతా క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. మృతురాలి తండ్రి బాదావత్ వసంత్ రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అంజలి పూజ(ఫైల్)

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో బుధవారం ఉదయం చికిత్స పొందుతున్న తరుణంలో గుండెపోటుతో మరణించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు, నలుపు రంగు టీషర్టు ఉందని, మృతుని ఆచూకీ తెలిసినవారు ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మద్యం తాగొద్దంటే కత్తితో పొడుచుకున్నాడు


షేక్ రఫత్ (ఫైల్)

ఖలీల్‌వాడి: నిత్యం మద్యం తాగివస్తే కుటుంబ పోషణ ఎలా గడుస్తుందని భార్య అడగడంతో భర్త కత్తితో పొడుచుకున్న ఘటన నగరంలో చోటు చేసుకుంది. రెండో టౌన్ ఎస్సై యాసీన్ ఆరాఫత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అహ్మద్‌పుర కాలనీకి చెందిన షేక్ రఫత్ (43), రేష్మాబేగం దంపతులు. రఫత్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. నిత్యం మద్యం సేవిస్తే ఆటో ఫైనాన్స్, పిల్లల చదువుతోపాటు కుటుంబం ఎలా గడుస్తుందని రఫత్‌ను మంగళవారం భార్య ప్రశ్నించింది. దీంతో ఇంట్లో ఉన్న మామిడికాయలు కోసే కత్తితో రఫత్ పొడుచుకున్నాడు. గమనించిన భార్య జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ రఫత్ బుధవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒంటరి జీవితంపై విరక్తితో మహిళ..


మల్లవ్వ (ఫైల్)

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన కొత్తపల్లి మల్లవ్వ (52) మంగళవారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై స్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లవ్వ భర్త ఎల్లయ్య 2001 నుంచి కనిపించడం లేదు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూతురికి పెళ్లి చేయగా కుమారుడు నరేశ్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి మల్లవ్వ ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. కుటుంబీకులు దగ్గర లేకపోవడంతో ఒంటరి జీవితంపై విరక్తి చెంది మంగళవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని బుధవారం చెరువులో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్రవంతి వివరించారు.

కుటుంబ కలహాలతో ఒకరు..


రాజన్న (ఫైల్)

ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన తూర్పు రాజన్న (48) కుటుంబ కలహాలతో మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. రాజన్న నెల రోజుల క్రితమే గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చాడని, ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసిన ఇద్దరు వ్యక్తులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. నందిపేట మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికను ఇన్‌స్టాగామ్‌లో పరిచయం చేసుకున్న సాలూర మండల కేంద్రానికి చెందిన మైత్రి రాజ్‌కుమార్ పెళ్లి చేసుకుంటానని చెప్పి కిడ్నాప్ చేసి బోధన్ మండలంలోని సాలంపాడు గ్రామంలో స్నేహితుడి ఇంటి వద్ద దాచి పెట్టాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు.. బాలికను కిడ్నాప్ చేసిన మైత్రి రాజ్ కుమార్‌తోపాటు సాలంపాడుకు చెందిన దంతం రాజును అదుపులోకి తీసుకొని ఇద్దరిపై కిడ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన బైక్, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

మోపాల్‌లో ఒకరిపై..

మోపాల్: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై బుధవారం పోక్సో కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి అదే గ్రామంలోని మైనర్‌పై కొంతకాలంగా లైంగికదాడికి పాల్పడుతున్నాడు. బాలిక నాలుగు నెలల గర్భిణి కావడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. కాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి క్యాంపులో బుధవారం విద్యుత్ షాక్ తగిలి కృష్ణార్జున్‌కు చెందిన గేదె మృతి చెందింది. గేదె మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుష్ రాడ్‌ను తాకడంతో షాక్ తగిలింది. మృతి చెందిన గేదె విలువ రూ. లక్షా 20వేల వరకు ఉంటుందని రైతులు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: భర్తను గొంతు నుమిలి హత్య చేసిన భార్యకు జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ మూడో అదనపు సెషన్స్ జడ్జి ఆశాలత బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట్ మండలం జన్నేపల్లి గ్రామానికి చెందిన ముక్కల సాయిలు, రేఖ భార్యాభర్తలు. వీరికి కూమార్తె, కుమారుడు ఉన్నారు. భార్యపై అనుమానంతో సాయిలు రోజు మద్యం తాగివచ్చి శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో భర్తను కడతేర్చాలని రేఖ నిర్ణయించుకుంది. 2024 ఏప్రిల్ 11న రాత్రి 11గంటలకు మద్యం మత్తులో నిద్రిస్తున్న భర్తను రెండు చేతులతో గొంతు నులిమి హత్యచేసింది. అనంతరం చీరతో ఉరి వేసి ఆత్మహత్యగా చిత్రీకరించింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు రేఖ తన భర్తను హత్య చేసినట్లు నిర్ధారిస్తూ జీవిత కారాగార శిక్షతోపాటు సాక్ష్యాలను తారుమారు చేసినందున సెక్షన్ 201 ప్రకారం ఏడేళ్ల కఠిన జైలుశిక్ష విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని జడ్జి ఆశాలత తీర్పులో పేర్కొన్నారు.

హత్య కేసులో మరొకరికి..

ఖలీల్‌వాడి: వ్యక్తిని హత్య చేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు సెషన్స్ జడ్జి తూముకుంట శ్రీనివాస్ బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని చంద్రశేఖర్‌నగర్ కాలనీకి చెందిన జలీల్‌ఖాన్ రోజూ ఓ మహిళను బహిరంగ ప్రదేశంలో బూతులు తిట్టేవాడు. దీంతో రోడ్డు పక్కనే రొట్టెలు చేసే తన పెద్దమ్మ కమలాబాయి, మరో మహిళ కాశక్క ఇబ్బంది పడుతున్నారని అదే కాలనీకి చెందిన తంగల్వాడి నర్సింగ్ అలియాస్ సోను.. జలీల్‌ఖాన్‌ను బెదిరించేవాడు. అయినా మార్పు రాకపోవడంతో విసిగివేసారిన నర్సింగ్.. 2024 ఫిబ్రవరి 14న రాత్రి 8:30 గంటలకు జమీల్‌ఖాన్ యథావిధిగా బూతుమాటలు మాట్లాడడం చూసి తట్టుకోలేదు. వెదురు కర్రతో తల, ముఖంపై బలంగా కొట్టడడంతో జలీల్‌ఖాన్ అక్కడికక్కడే మృతి చెందినట్లు నేర న్యాయ విచారణలో నిరూపితమైనట్లు జడ్జి శ్రీనివాస్ ప్రకటించాడు. హత్యానేరానికి గాను నర్సింగ్‌కు జీవిత కారాగార శిక్షను ఖరారు చేశారు. నిజామాబాద్ రూరల్ పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ వాదనలు వినిపించారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి ఏడాది..

ఖలీల్‌వాడి: మోపాల్ పీఎస్ పరిధిలో ఎస్సై విధులకు ఆటంకపరిచిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ జడ్జి శ్రీనివాస్ రావు తీర్పు వెలువరించినట్లు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోపాల్‌లో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఎస్సై సతీశ్ చర్యలు తీసుకునే క్రమంలో మాక్లూర్ మండలం గుత్పకు చెందిన రెంజర్ల శ్రీనివాస్, రెంజర్ల మండల కేంద్రానికి చెందిన రంగన్నగారి నర్సారెడ్డి మద్యం మత్తులో ఎస్సైపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు. వారికి ఏడాది జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. 2 వేల జరిమానా విధించినట్లు చెప్పారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజులు..

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాన్ని నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధించినట్లు ఎస్సై సందీప్ పేర్కొన్నారు. నాందేడ్ జిల్లా దెగ్లూర్‌కు చెందిన ఎండీ ఇలియాస్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడని తెలిపారు. బోధన్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి శేషతల్ప సాయి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

తమ్ముడిని చంపిన అన్నకు..

కామారెడ్డి క్రైం: ఆస్తి కోసం సొంత తమ్ముడిని దారుణంగా హత్య చేసిన నిందితుడికి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. పిట్లంకు చెందిన సబీరా బేగంకు స్థానికంగా వెయ్యి గజాల ప్లాటు ఉంది. తనకు రావాల్సిన వాటా పంచి ఇవ్వాలని ఆమె పెద్ద కొడుకు మహమ్మద్ షాదుల్ తరచుగా గొడవ పడేవాడు. గొడవలు వద్దంటూ చిన్న కొడుకు మహమ్మద్ ముజీబ్ సర్ది చెప్పేవాడు. దీంతో ముజీబ్‌పై షాదుల్ కక్ష పెంచుకున్నాడు. 2021 మే 14న రంజాన్ కావడంతో కుటుంబం అంతా ఒకే చోట ఉన్న సమయంలో షాదుల్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ముజీబ్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ముజీబ్‌ను కుటుంబ సభ్యులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడు. కేసు నమోదు చేసిన పిట్లం పోలీసులు షాదుల్‌ను రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ నేరం రుజువు కావడంతో నిందితుడు షాదుల్‌కు జీవిత ఖైదు రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన అప్పటి బాన్సువాడ సీఐ చంద్రశేఖర్, ఎస్సై రంజిత్, ప్రస్తుత బాన్సువాడ సీఐ రాజేశ్, ఎస్సై రాజు, పోలీసుల తరఫున వాదనలు వినిపించిన పీపీలు దామోదర్ రెడ్డి, సూర్య ప్రసాద్, కోర్టు లైజనింగ్ అధికారి మురళి, సిబ్బంది కిషన్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బిల్ కలెక్టర్‌కు తీవ్రగాయాలు

ఆర్మూర్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ బిల్ కలెక్టర్ వెంకటేశ్వర్ రావుకు తీవ్రగాయాలయ్యాయి. సోమవారం రాత్రి ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో విధులు ముగించుకొని జూనియర్ అసిస్టెంట్ రాజయ్యతో కలిసి వెంకటేశ్వర్ రావు నిజామాబాద్‌లోని తన ఇంటికి వెళుతున్నాడు. మాక్లూర్ మండలం చిన్నాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై వరి ధాన్యం ఆరబెట్టడంతో వాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో తీవ్రగాయాలైన వెంకటేశ్వర్‌రావును జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా ఇన్‌ఫెక్షన్ కావడంతో కాలును తొలగించారు.

షాపు యజమానులకు జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి వ్యాపార సమయం దాటిన తర్వాత దుకాణాలను తెరిచి ఉంచిన ఇద్దరు వ్యాపారులకు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. మంగళవారం నిర్దేశిత సమయానికి మించి వ్యాపార కార్యకలాపాలు కొనసాగించిన యజమానులు షేక్ గౌస్ పాషా (షా గౌస్ హోటల్), అన్సార్ హుస్సేన్(ఖురేషి హోటల్)ను బుధవారం జిల్లా స్పెషల్ సెకండ్ క్లాస్ జడ్జి ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. కోర్టు ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష విధించగా, జిల్లా జైలుకు తరలించామని తెలిపారు.